బుమ్రా (4/50)

తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు ఆలౌట్

బంగ్లా ఢమాల్

4 వికెట్లతో బుమ్రా విజృంభణ • రాణించిన ఆకాశ్, సిరాజ్ • భారత్ ఆధిక్యం 308 పరుగులు

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య భారత్ అదరగొడుతున్నది. సొంతగడ్డపై సత్తాచాటుతూ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మ్యాచ్‌పై మరింత పట్టు సాధించింది. అశ్విన్ సూపర్ సెంచరీకి తోడు జడేజా యాంకర్ ఇన్నింగ్స్‌తో భారీ స్కోరు అందుకున్న భారత్..బంగ్లా భరతం పట్టింది. యార్కర్‌కింగ్ బుమ్రా నాలుగు వికెట్ల విజృంభణకు తోడు ఆకాశ్‌దీప్, సిరాజ్, జడేజా రాణించడంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలింది. వెటరన్ షకీబ్ అల్‌హసన్(32) టాప్ స్కోరర్‌గా నిలువగా సహచర బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. బుమ్రా నిప్పులు చెరిగే బంతులతో బంగ్లా బ్యాటింగ్ ఆర్డర్ కకావికలమైంది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్‌ఇండియా 3 వికెట్ల నష్టానికి 81 పరుగులతో కొనసాగుతున్నది. కెప్టెన్ రోహిత్‌శర్మ(5), విరాట్ కోహ్లీ(17) మరోమారు నిరాశపర్చగా, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ క్రీజులో ఉన్నారు. చేతిలో ఏడు వికెట్లు ఉన్న భారత్ ప్రస్తుతం 308 పరుగుల భారీ ఆధిక్యంలో ఉన్నది. మూడు రోజులు మిగిలున్న మ్యాచ్‌లో అద్భుతం జరిగితే తప్ప.. భారత్ విజయాన్ని అడ్డుకోవడం అసాధ్యం!

చెన్నై: భారత పేసర్లు విజృంభించడంతో చెన్నై వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టీమ్‌ఇండియా పటిష్ట స్థితిలో నిలిచింది. పేసు గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా (4/50) నాలుగు వికెట్లతో బంగ్లా వెన్ను విరవగా యువ పేసర్ ఆకాశ్ దీప్ (2/19), మహ్మద్ సిరాజ్ (2/30)కు తోడు స్పిన్నర్ రవీంద్ర జడేజా (2/19) చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో పర్యాటక జట్టు 47.1 ఓవర్లలో 149 పరుగులకే చాప చుట్టేసింది. ఆ జట్టులో షకీబ్ అల్‌హసన్ (32) టాప్ స్కోరర్. బంగ్లాను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసిన భారత్.. 227 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి రోహిత్ సేన.. 23 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 81 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (33 బ్యాటింగ్), రిషభ్ పంత్ (12 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం భారత్ 308 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది.

గంటలోపే ఆలౌట్

ఓవర్ నైట్ స్కోరు 339/6తో రెండో రోజు ఆరంభించిన భారత్ మరో 37 పరుగులు మాత్రమే జోడించి ఫస్ట్ సెషన్‌లో గంటలోపే ఆలౌట్ అయింది. ఓవర్ నైట్ స్కోరుకు ఒక్క పరుగూ జోడించకుండానే జడేజా (86) వెనుదిరగగా సెంచరీ హీరో రవిచంద్రన్ అశ్విన్ (113) మరో 11 పరుగులు జతచేశాడు. ఆకాశ్ దీప్ (17) నాలుగు బౌండరీలతో మెరుపులు మెరిపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 376 పరుగులు చేసింది. యువ బౌలర్ హసన్(5/83) ఐదు వికెట్లతో అదరగొట్టాడు.

వణికించిన పేసర్లు

భారత సీమర్ల ధాటికి బంగ్లా పతనం తొలి ఓవర్ నుంచే మొదలైంది. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే ఓపెనర్ షాద్మన్ (2) క్లీన్ బౌల్డ్ ఔట్ అయ్యాడు. బుమ్రా వేసిన ఇన్‌స్వింగర్‌ను తప్పుగా అంచనా వేసిన అతడు.. ఆఫ్ స్టంప్‌ను వదిలేసి ఆడి మూల్యం చెల్లించుకున్నాడు. ఆకాశ్ దీప్ 9వ ఓవర్లో వరుస బంతుల్లో జకీర్ హసన్ (3), మోమినుల్ హక్ (0)ను ఔట్ చేశాడు. లంచ్ విరామ సమయానికి బంగ్లా స్కోరు 9 ఓవర్లలో 26/3గా ఉంది. లంచ్ తర్వాత సిరాజ్ వేసిన 12వ ఓవర్లో కెప్టెన్ నజ్ముల్ శాంతో (20) స్లిప్స్‌లో కోహ్లీ చేతికి చిక్కాడు. ప్రమాదకర ముష్ఫీకర్ రహీమ్ (8) సైతం బుమ్రా బౌలింగ్‌లో కేఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చాడు. 40 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ బంగ్లాదేశ్‌ను షకిబ్, లిటన్ దాస్ (22) ఆదుకునే యత్నం చేశారు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 51 పరుగులు జోడించారు. కానీ జడేజా రంగప్రవేశంతో రోహిత్ వీరి ఆట కట్టించాడు. జడ్డూ బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్ ఆడబోయిన దాస్.. డీప్ స్క్వేర్ లెగ్ వద్ద సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ ధ్రువ్ జురెల్ చేతికి చిక్కాడు. అతడి బౌలింగ్‌లోనే రివర్స్ స్వీప్ ఆడబోయిన షకిబ్.. రిషభ్ పంత్ క్యాచ్ పట్టడంతో ఔట్ అయ్యాడు. మిరాజ్ ఆదుకున్నా అతడికి అండగా నిలిచే బ్యాటర్ లేకపోవడంతో ఆ జట్టు 149కే ఆలౌట్ అయింది.

400

ఈ మ్యాచ్‌లో హసన్ మహ్మద్‌ను ఔట్ చేయడంతో టెస్టులలో బుమ్రా అంతర్జాతీయ క్రికెట్‌లో 400 వికెట్లను పూర్తి చేసిన పదో భారత బౌలర్ (పేసర్లలో ఆరోవాడు)గా నిలిచాడు.

భారీ ఆధిక్యం దిశగా..

తొలి ఇన్నింగ్స్‌లో 227 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకున్న భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభంలో మరోసారి తడబడింది. రోహిత్ (5) మళ్లీ నిరాశపరచగా మొదటి ఓవర్‌లోనే రెండు బౌండరీలు బాదిన యశస్వీ జైస్వాల్ (10) కూడా విఫలమయ్యాడు. గిల్‌తో కలిసి క్రీజులో నిలదొక్కుకున్నట్టే కనిపించిన కోహ్లీ (17) అంపైర్ తప్పుడు నిర్ణయం కారణంగా బలయ్యాడు. మిరాజ్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగిన కోహ్లీ.. డీఆర్ఎస్ తీసుకోకుండానే క్రీజును వీడాడు. కానీ రిప్లైలో బంతి కోహ్లీ బ్యాట్‌ను తాకుతూ వెళ్లినట్టుగా కనిపించింది. గిల్, పంత్‌తో పాటు రాహుల్, అశ్విన్, జడేజా వంటి బ్యాటర్లు క్రీజులో ఉండటంతో భారత్ 400 ప్లస్ ఆధిక్యంపై కన్నేసింది! మొత్తంగా రెండో రోజు ఆటలో ఏకంగా 17 వికెట్లు నేలకూలడం గమనార్హం.

భారత్ తొలి ఇన్నింగ్స్: 376 ఆలౌట్
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్:149 ఆలౌట్ (షకిబ్ 32, మిరాజ్ 27 నాటౌట్, బుమ్రా 4/50, ఆకాశ్ 2/19) **భారత్ రెండో ఇన్నింగ్స్** :81/3 (గిల్ 33 నాటౌట్, పంత్ 12 నాటౌట్)

ముగిసిన మాళవిక పోరు

చెంగ్డూ: చైనా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో తన కంటే మెరుగైన ప్రత్యర్థులను చిత్తుచేసి క్వార్టర్స్ చేరిన భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో మాళవిక 10-21, 16-21తో అకానె యమగుచి (జపాన్) చేతిలో ఓడింది. 35 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో ప్రపంచ ఐదో ర్యాంకర్ యమగుచి ధాటికి మాళవిక నిలువలేకపోయింది. మాళవిక ఓటమితో ఈ టోర్నీలో భారత పోరాటం ముగిసినట్టైంది.

గుర్బాజ్ శతక చరిత్ర

షార్జా: దక్షిణాఫ్రికాతో షార్జా వేదికగా జరిగిన రెండో వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్(105) సరికొత్త చరిత్ర సృష్టించాడు. అఫ్గన్ తరపున దక్షిణాఫ్రికాపై వన్డేలలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు పుటల్లో కెక్కాడు. వన్డేలలో అతడికి ఇది 7వ శతకం. తద్వారా ఆ జట్టు తరపున వన్డేలలో అత్యధిక సెంచరీలు చేసిన మహ్మద్ షాజాద్ (6) రికార్డును అధిగమించాడు. గుర్బాజ్‌తో పాటు అజ్మతుల్లా (86 నాటౌట్), రెహ్మత్ షా(50) రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్.. నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 311 పరుగుల భారీ స్కోరు చేసింది.

రాజస్థాన్ బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్

జైపూర్: రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ విక్రమ్ రాథోడ్ ఎంపికయ్యాడు. రానున్న సీజన్ కోసం ఇప్పటికే దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్‌ను చీఫ్ కోచ్‌గా తీసుకున్న రాయల్స్ యాజమాన్యం తాజాగా విక్రమ్‌ను నియమించుకుంది. ఈ విషయాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 2019 నుంచి ఇటీవలే ముగిసిన టీ20 ప్రపంచకప్ వరకు టీమ్‌ఇండియా బ్యాటింగ్ కోచ్ రాథోడ్ వ్యవహరించాడు. 'ద్రవిడ్‌తో కలిసి మళ్లీ పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. రాయల్స్ కుటుంబంలో భాగం కాబోతున్నందుకు గర్వపడుతున్నాను' అని అన్నాడు.

రాజేశ్వరి పసిడి ధమాకా

తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియనషిప్

కొల్లాపూర్, సెప్టెంబర్ 20 : ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) వేదికగా జరుగుతున్న 10వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ అథ్లెట్ గడ్డం రాజేశ్వరి పసిడి ధమాకా కొనసాగిస్తున్నది. టోర్నీలో ఇప్పటికే 5కిలోమీటర్ల రేస్ వాక్(19నిమిషాల 55 సెకన్లు)లో స్వర్ణం కొల్లగొట్టిన రాజేశ్వరి మళ్లీ సత్తాచాటింది. శుక్రవారం జరిగిన బాలికల అండర్-20..3వేల స్టిపుల్‌చేజ్ రేసును 12 నిమిషాల 30 సెకన్లలో పూర్తి చేసిన ఈ అమ్మాయి మరో స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామానికి చెందిన రాజేశ్వరి విజయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర క్రీడాభివృద్ధికి సహకరించండి

- **కేంద్రక్రీడా మంత్రికి సాట్స్ విజ్ఞప్తి**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సహకరించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాకు సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గచ్చిబౌలి సాయ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించిన మంత్రికి వినతిపత్రం అందజేశారు. భవిష్యత్‌లో దేశంలో జరిగే మెగాటోర్నీల ఆతిథ్యంలో రాష్ట్రానికి అవకాశమివ్వాలని మంత్రిని కోరారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందని, ఇందుకోసం కేంద్రం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గచ్చిబౌలి స్టేడియంతో పాటు సాయ్ శిక్షణా కేంద్రంలో వసతులను మాండవీయ పరిశీలించారు. అక్కడే శిక్షణ పొందుతున్న పారాలింపిక్స్ పతక విజేత దీప్తితో పాటు అథ్లెట్లను మంత్రి సన్మానించారు.

డబ్బులిస్తేనే దేశం కోసం ఆడతానన్నాడు

- **సుమిత్ నాగల్‌పై ఐటా ఆరోపణలు**

ఢిల్లీ: భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ దేశం కోసం (డేవిస్ కప్‌లో) ఆడేందుకు భారీగా నగదు డిమాండ్ చేశాడని ఆలిండియా టెన్నిస్ సమాఖ్య (ఐటా) సంచలన ఆరోపణలు చేసింది. డేవిస్ కప్ ఆడేందుకు నాగల్‌తో పాటు యూకీ బాంబ్రీ, శశికుమార్ తిరస్కరించారని, ఈ టోర్నీలో పాల్గొనాలంటే ఏడాదికి తనకు 50 వేల యూఎస్ డాలర్లు (రూ.45 లక్షలు) చెల్లించాలని నాగల్ డిమాండ్ చేసినట్టు ఐటా కార్యదర్శి అనిల్ ధూపర్ వెల్లడించాడు. 'దేశం తరపున ఆడేప్పుడు ఒక క్రీడాకారుడు డబ్బులు డిమాండ్ చేయడమేంటి? డేవిస్ కప్‌లో ఆడాలంటే రూ. 45 లక్షలు ఇస్తేనే ఆడతానని లేకుంటే ఆడనని నాగల్ చెప్పాడు' అని అన్నాడు. అయితే ఈ ఆరోపణలపై నాగల్ సైతం ఘాటుగానే స్పందించాడు. 'దేశం తరపున ఆడినా ప్రొఫెషనల్ క్రీడాకారులకు పరిహారం ఇవ్వడం సర్వసాధారణమే. ఇందులో సొంత ప్రయోజనాలేమీ లేవు' అని ఎక్స్ ఖాతాలో వివరణ ఇచ్చాడు.

రసవత్తరంగా గాలె టెస్టు

చండిమాల్ (61)

గాలె: శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా సాగుతోంది. లంకేయులను 305 పరుగులకు ఆలౌట్ చేసిన కివీస్.. మొదటి ఇన్నింగ్స్‌లో 340 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన లంక.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 237 పరుగులు సాధించింది. కరుణరత్నె (83), చండిమాల్ (61) రాణించారు. మాథ్యూస్ (34 నాటౌట్), డి సిల్వ (34 నాటౌట్) క్రీజులో ఉన్నారు. లంక ప్రస్తుతం 202 పరుగుల ఆధిక్యంలో ఉంది.

- **దవాఖానలో వీధి కుక్కల స్వైరవిహారం**

నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖాన ప్రాంగణంలో శుక్రవారం ఉదయం వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. సుమారు ఏడు గ్రామ సింహాలు దవాఖానలోకి ప్రవేశించాయి. గుంపులు.. గుంపులుగా ఓపీ రూమ్ ముందు సంచరించాయి. దీంతో అక్కడున్న రోగులు భయాందోళకు గురయ్యారు. అయినా వాటిని తరుమకపోవడంతో రోగులు, వారి బంధువులు దవాఖాన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

-నాగర్‌కర్నూల్

చిన్నారులపై వీధికుక్కల దాడి

ఇద్దరికి గాయాలు: వనపర్తి జిల్లా అమరచింతలో ఘటన

అమరచింత, సెప్టెంబర్ 20 : ఆడుకుంటున్న చిన్నారులపై వీధికుక్కలు దాడి చేసిన ఘటన వనపర్తి జిల్లా అమరచింతలోని శ్రీకృష్ణనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ఉదయం పాఠశాలకు వెళ్లే ముందు అభినాష్, అక్షయ్‌కుమార్ ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. అక్షయ్‌కుమార్ ఎడమ చెవికి, అభినాష్ వీపుపై గాయాలయ్యాయి. అక్షయ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించగా.. అభినాష్‌కు స్థానికంగా చికిత్స చేయిస్తున్నారు. కాలనీలో వీధికుక్కల సంచారం ఎక్కువైందని, మున్సిపల్ అధికారులు వాటిని పట్టణానికి దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

నీట్ 'స్థానిక' విద్యార్థులకు ఊరట

- **పిటిషనర్లు కౌన్సిలింగ్‌కు హాజరుకావొచ్చు**
- **సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. 135 మందికి లబ్ధి**
- **ఈ ఒక్కసారి అవకాశం ఇస్తామన్న ప్రభుత్వం**

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): 'స్థానికత' వివాదంలో విద్యార్థులకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. పిటిషనర్లు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది. ఇదే సమయంలో ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానికతను నిర్ధారిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-33ను సవాల్ చేస్తూ దాదాపు 135 మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థులకు అనుకూలంగా హైకోర్టు ఈ నెల 5న తీర్పు వెలువరించగా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంలో రాజ్యాంగ ధర్మాసనంతోపాటు నాలుగు తీర్పులు తమకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. తెలుగు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు విదేశాల్లో చదివి, తెలంగాణలో నీట్ పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. దీంతో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఏపీ విద్యార్థులు తెలంగాణలో నీట్‌కు హాజరుకావొచ్చని, కానీ తెలంగాణ విద్యార్థులకు ఏపీలో ఆ అవకాశం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో స్థానికతను నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో-33 తీసుకువచ్చిందని, దీనిని హైకోర్టు నిలిపివేసిందని తెలిపారు. సెప్టెంబర్ చివరివారంలో నీట్ కౌన్సెలింగ్ మొదటి రౌండ్, అక్టోబర్ మొదటి వారంలో రెండో విడత కౌన్సెలింగ్ ఉన్నదని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు, కౌన్సెలింగ్‌కు తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో పిటిషనర్లు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. అయితే ఈ మినహాయింపు ఈ ఒక్కసారికి మాత్రమేనని స్పష్టం చేశారు. విద్యార్థుల తరపు న్యాయవాది మురళీధర్ వాదనలు వినిపిస్తూ.. నీట్ ఫలితాలకు వారం రోజుల ముందు తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో తెచ్చిందన్నారు. ఆగస్టు 26న నీట్ ఫలితాలు రాగా, 19వ తేదిన జీవో 33 తెచ్చారని తెలిపారు. రెండు, మూడు సంవత్సరాలు చదువుల కోసం రాష్ట్రానికి దూరంగా ఉంటే స్థానికతను దూరం చేయకూడదని వాదించారు. ఇరువైపు వాదనలు విన్న అనంతరం.. రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిన నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తూ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. మూడు వారాల్లో సమాధానం చెప్పాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కేసును వచ్చే నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లో మరమ్మతు చేసిన బోరు వద్ద గ్రామ మహిళలు

చిన్నలింగాపూర్‌కు నీళ్లొచ్చినయ్

సమస్యను పరిష్కరించిన అధికారులు

నమస్తే ఎఫెక్ట్

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 20: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లో నీటి సమస్య తీరింది. మూడు నెలలుగా నీటి సమస్య ఉన్నా.. పంచాయతీ కార్యదర్శి, అధికారులు పట్టించుకోవడం లేదని గురువారం మహిళలు ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో 'మంచినీళ్లు మహాప్రభో' శీర్షికన శుక్రవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించారు. గ్రామంలోని బోర్లు మరమ్మతు చేసి, నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. మాజీ ఎంపీటీసీ బైరినేని రాము చొరవతో జీపీ కార్యదర్శి నీరజ, సిబ్బంది బోర్లను మరమ్మతు చేయించి కొత్త బోరు మోటర్ బిగించి శుక్రవారం నీటిని సరఫరా చేశారు. దీంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

రైస్‌మిల్లుల మాయాజాలం

- **భారీగా సీఎంఆర్ మాయం**
- **పెంచికల్‌పేట మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు**
- **క్రిమినల్ కేసులకు సిఫారసు**

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 20: ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యంలో రైస్‌మిల్లుల యజమానులు భారీగా అవినీతికి పాల్పడ్డారు. కోట్లాది రూపాయల విలువ చేసే ధాన్యాన్ని ప్రైవేట్‌కు అమ్ముకున్నట్టు తేలింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేటలోని శ్రీ బాలాజీ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లుపై శుక్రవారం పొద్దుపోయిన తర్వాత సివిల్ సప్లయిస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. మిల్లులో నిల్వ ఉన్న సీఎంఆర్‌ను లెక్కించగా భారీ ఎత్తున బస్తాలు మాయమైనట్టు తేలింది. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేకాధికారి ఎల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బాలాజీ మిల్లుకు 2021-22, 2022-23 సంవత్సరాలకు మొత్తంగా 6,339 టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్‌కు కేటాయించగా, దీనికిగాను 4,310 టన్నుల బియ్యాన్ని తిరిగి మిల్లు యజమాని ఇవ్వాల్సి ఉండగా, కేవలం 1,889 టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చినట్టు తెలిపారు. మిగతా 3,521 టన్నుల ధాన్యం మిల్లులో ఉండాల్సి ఉండగా, కేవలం 205 టన్నుల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు. మిగతా ధాన్యం మిల్లు యజమాని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నట్టు తేలిందని అన్నారు. కనపడని ధాన్యం విలువ సుమారు రూ.7.50 కోట్లు ఉంటుందని చెప్పారు. ధాన్యం లేనిపక్షంలో డబ్బు చెల్లించేందుకైనా ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. అయినప్పటికీ మిల్లుల యజమానులు స్పందించకపోవడంతో తనిఖీలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. మిల్లు యజమాని రవీందర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులకు సిఫారసు చేయనున్నట్టు తెలిపారు.

మిల్లులో సీఎంఆర్ ధాన్యాన్ని లెక్కిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు

తాడ్వాయి సహకార సంఘంలో పాలకవర్గ సభ్యులను నిర్బంధించిన రైతులు

రుణమాఫీ చేయాలని సొసైటీకి తాళం

- **పాలకవర్గ సభ్యుల నిర్బంధం**
- **కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో ఘటన**

లింగంపేట (తాడ్వాయి), సెప్టెంబర్ 20: వ్యవసాయ రుణాలు పొందిన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘ పాలకవర్గ సభ్యులను రైతులు శుక్రవారం నిర్బంధించారు. సొసైటీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లారు. సహకార సంఘం చైర్మన్ కపిల్‌రెడ్డి, సీఈవో నర్సింహులు, డైరెక్టర్లను విండో కార్యాలయంలో నిర్బంధించారు. రుణమాఫీ మాఫీ చేయాలని నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ హోదాలో కౌలు రైతులకు, ఉపాధి హామీ కూలీలకు రైతు భరోసా కల్పిస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులు నర్సింహులు, సుధాకర్, గంగారెడ్డి, రమేశ్, నారాయణ, స్వామి, సుధాకర్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

ఫోర్జరీ కేసులో బీజేపీ నాయకుడి అరెస్టు

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 20 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు అజ్మీరా హరినాయక్‌ను ఫోర్జరీ సంతకాల కేసులో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. లక్షెట్టిపేటలో ఏసీపీ ప్రకాశ్ మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. అల్లీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు అనే పట్వారి 1998లో సుమారు 7.26 గుంటల భూమిని తనకు అమ్మినట్టు అజ్మీరా హరినాయక్ దొంగ పత్రాలు తయారు చేశాడు. ఆపై ఆ భూమిని కబ్జా చేశాడు. కానీ, పట్వారి ఆ భూమిని 1990లోనే తన నలుగురు కుమారులకు పట్టా చేశాడు. ఈ క్రమంలో భూమి వద్దకు వస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని అజ్మీరా హరినాయక్ పలుమార్లు ఆయన కుమారులను బెదిరించాడు. ఈ క్రమంలో దొంగ పత్రాలు పట్టుకొని తమను బెదిరిస్తున్నాడంటూ పట్వారీ కొడుకు మురళీధర్‌రావు అజ్మీరా హరినాయక్‌పై దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో గత ఆగస్టు 17న ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేయగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పట్వారి చదువుకున్న వ్యక్తి కావడం, ఫోర్జరీ పత్రాలపై వేలి ముద్రలు ఉండటం.. సాక్షులుగా ఉన్న వారిలో ఏ ఒక్కరు బతికి లేకపోవడంతో పక్కగా ఫోర్జరీ చేసినట్టు తేల్చారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని చీటింగ్, ఫోర్జరీతోపాటు మరికొన్ని సెక్షన్ల కింది కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే సుమారు ఏడు కేసులు ఉన్నాయని, ఇంకా చాలా ఆరోపణలు కూడా ఉన్నట్టు తెలిసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krish